# సాక్షి
# పార్వతీపురం మన్యం

మంగళవారం । 1 । జూలై । 2025




## ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రసంగం



విజయనగరం టౌన్: జగన్నాథుని రథయాత్రలో భాగంగా విజయనగరం తోమాల మందిరం వద్ద రాజాం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి సోమవారం రాత్రి నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రసంగం భక్తులను ఆద్యంతం ఆకట్టుకుంది. ఆలయ నిర్వాహకులు ఆమెను దుశ్శాలువతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.




## కూటమి పెద్దలకి పరమాన్నం, పేదలకి గంజి నీళ్లు

- 8లో

కాంగ్రెస్, టీడీపీ, నేటి కూటమి ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా భూములను కట్టబెడుతున్నాయని సీపీఐ నాయకులు ఆరోపించారు.

## న్యూస్‌రీల్

### జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మన్యం బిడ్డలు



నిమ్మలదేశిక్



తోయక నరేంద్ర నరసింహా

గుమ్మలక్ష్మీపురం: జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గుమ్మలక్ష్మీపురం మండలం జొల్లగూడ గ్రామానికి చెందిన నిమ్మల దేశిక్, కన్నయ్యగూడకు చెందిన తోయక నరేంద్రనరసింహా ఎంపికైనట్టు కోచ్, కొత్తగూడ జీటీడబ్ల్యూహెచ్ఎస్ పీడీ ఎస్.మాధవరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడుతూ.. జూన్ 26వ తేదీన విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో దేశిక్ అండర్-10, నరేంద్ర నరసింహా అండర్-12 ఈపీఈఈ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజయవాడలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జూన్ 29న జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వెల్లడించారు. వీరిద్దరూ మహారాష్ట్రలోని నాశిక్‌లో జూలై 5 నుంచి 7వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

### ఇన్‌చార్జి సీపీఓగా పట్నాయక్



వీర్రాజుకు పూలమొక్కను అందిస్తున్న పట్నాయక్

పార్వతీపురం రూరల్: జిల్లా ఇన్‌చార్జి ముఖ్య ప్రణాళిక అధికారిగా ఎస్ఎస్ఆర్‌కే పట్నాయక్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన పి.వీర్రాజు ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో విశాఖపట్నం సీపీఓ కార్యాలయ సహాయ సంచాలకుడిగా పనిచేస్తున్న పట్నాయక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గణాంక సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

### సచివాలయ ఏఎన్ఎంలకు బదిలీ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓలు జీవనరాణి, భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సచివాలయం ఏఎన్ఎంలకు జూమ్‌లో సోమవారం బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. విజయనగరం డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. జీవనరాణి, పార్వతీపురం డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు, ఏఓ ప్రభూజీ, సూపరింటెండెంట్ నాగరాజు కౌన్సిలింగ్ నిర్వహించారు.

### గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పదోన్నతులు



పదోన్నతుల ప్రక్రియలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్స్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పించినట్లు గిరిజన సంక్షేమశాఖ డీడీ ఆర్.కృష్ణవేణి తెలిపారు. పీఓ ఆదేశాల మేరకు పదోన్నతుల ప్రక్రియను సోమవారం నిర్వహించి 19మందికి పదోన్నతులు కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అధికారులు కె.దేష్, ఏటీడబ్ల్యూఓ ఒ.కె చంద్రబాబు పాల్గొన్నారు.

### మడ్డువలసలో ఏనుగులు తిష్ట

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు పరిసరాల్లో తొమ్మిది ఏనుగులు తిష్టవేశాయి. చెరకు, వరినారు మడులను ధ్వంసం చేస్తున్నాయి. వంగర-రాజాం రోడ్డు పక్కన సోమవారం సంచరించడంతో అటవీ, పోలీస్ శాఖ సిబ్బంది అప్రమత్తమై రాకపోకలను కాసేపు నిలిపివేశారు. పార్వతీపురం మన్యం జిల్లా అటవీశాఖ రేంజర్ మణికంఠేశ్వరరావు, సిబ్బంది ఏనుగుల గమనాన్ని పరిశీలిస్తూ గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నదే ప్రతి సోమవారం గ్రామ/వార్డు సచివాలయం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) ప్రధాన లక్ష్యం. పేరులోనే అసలు ఉద్దేశం స్పష్టంగా ఉంది. అందులో అర్జీ ఇచ్చుకుంటే.. పరిష్కారం మాట దేవుడెరుగు! అసలు గొంతు విప్పి.. మన సమస్య చెప్పుకొనే వీలు కూడా లేదన్నది ఇప్పటి కొత్త నిబంధన!! ఇది జిల్లా యంత్రాంగమే తీసుకొచ్చిందా.. లేకుంటే కూటమి ప్రభుత్వమే తెరపైకి తెచ్చిందా!! అన్నది ప్రజలకు అర్థంకాని ప్రశ్న. – సాక్షి, పార్వతీపురం మన్యం

# గొంతు విప్పొద్దు.. చేయి ఎత్తొద్దు!

అర్జీలిచ్చేందుకు కలెక్టరేట్‌లోపలకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు



- బ్యానర్లు తెస్తే.. అటు నుంచి అటే...
- పీజీఆర్ఎస్‌లో కొత్త ఆంక్షలు
- పోలీసులతో వార్నింగులు
- వినతులిచ్చేవారి గళం నొక్కే ప్రయత్నం



కలెక్టరేట్ ఆవరణలో చినుకులు పడుతున్నా.. గొడుగులు వేసుకుని గట్టుపై కూర్చున్న అర్జీదారులు

### అధికారుల వాహనాలకు షెడ్డులు.. అర్జీదారులకు ఆరుబయట గట్లు!

కలెక్టరేట్ ప్రాంగణంలో ఇటీవల పలు మరమ్మతు పనులు చేపట్టారు. గదులు నిర్మించారు. అధికారుల వాహనాల పార్కింగ్‌కు షెడ్లు వేయించారు. పీజీఆర్ఎస్‌కు, వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులకు ఆంక్షలు పెట్టి, కట్టడి చేస్తున్నారు. పీజీఆర్ఎస్ మందిరంవైపు ఎక్కువ మంది రాకుండా వైర్లతో వలయం కట్టారు. కనీసం వారికి ఆరుబయట వేచి ఉండేందుకు ఏర్పాట్లు సైతం లేవు. సోమవారం వర్షం పడుతున్నా.. చెట్ల కింద, గట్లపైన, గొడుగులు వేసుకునే ప్రజలు అవస్థలు పడ్డారు. అర్జీదారులకు నిలువ నీడ చూపని మన అధికారులు.. తమ వాహనాలు మాత్రం ఎండకు, వానకు పాడవకుండా షెడ్డులు కట్టించుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



అధికారుల వాహనాలు ఉంచేందుకు నిర్మించిన షెడ్డులు

### కొత్త ఆంక్షలు.. సరికొత్త నిబంధనలు

అనుమతి లేనిదే నిరసనలు, ర్యాలీలు చేపట్టకూడదన్నది కొత్తగా యంత్రాంగం తీసుకొచ్చిన నిబంధన. కనీసం గుంపుగా తమ సమస్య వినిపించుకునేందుకు వచ్చినా.. పోలీసుల అనుమతి తీసుకోవాలని చెబుతున్నారు. రెండు రోజుల కిందట పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించేందుకు వస్తే.. కలెక్టరేట్ గేటు వద్దే పోలీసులు అడ్డుకున్నారు. వారిని వెనుకకు పంపించేశారు. తాజాగా సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలోనూ ఇదే తరహా ఆంక్షలు కనిపించాయి. సాధారణంగా సామాజిక సమస్యలపై సామూహికంగానే వినతులిచ్చేందుకు వస్తారు. ఆయా ప్రాంతంలోని గ్రామస్తులు.. వివిధ సంఘాల వారు మూకుమ్మడిగా వచ్చి అధికారులను కలిసి తమ మొర వినిపిస్తారు. నెలలు, ఏళ్ల తరబడి ఆ సమస్యకు మోక్షం కలగకపోతే.. కాస్త గట్టిగానే తమ గళం వినిపించి, నినాదాలు చేస్తారు. ఎన్నో ఏళ్లుగా ఈ పద్ధతి ఉంది. అటువంటి గొంతులపైనా కూటమి ప్రభుత్వం కత్తిగట్టింది. కలెక్టరేట్ గేటు దాటి గుంపులుగా వస్తే ఆంక్షలే.. లోపలికి వినతి ఇచ్చేందుకు నలుగురైదుగురు మించి వెళ్లకూడదట. బ్యానర్లు ప్రదర్శించకూడదంట. చేయి ఎత్తి నినాదాలు చేయకూడదు. గొంతు ఎత్తి గట్టిగా తమ వాణి వినిపించకూడదంట! మరి వినతుల పరిష్కారం మాట అని అడిగితే.. ఆ మాటకు సమాధానమే ఉండదంట!! వచ్చిన వారికి పోలీసులతో ప్రశ్నలు, హెచ్చరికలు. ఇన్ని ఆంక్షలు తాము ఎన్నడూ చూడలేదని ప్రజాసంఘాల నాయకులు అంటుంటే.. తామేమీ నిందితులమా, తీవ్రవాదులమా అని సాధారణ అర్జీదారులు వాపోతున్నారు.



ఈ చిత్రంలోని మహిళలు ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు. వీరికి ఐదునెలల జీతాల బకాయిలు ఉన్నాయి. నెలల తరబడి జీతాల బకాయి ఉంటే.. నిరుపేదలమైన తాము ఎలా జీవించగలమని వాపోతున్నారు. పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందించేందుకు మూకుమ్మడిగా వస్తే పోలీసులు అడ్డుకున్నారు. పరిమితంగానే లోపలికి వెళ్లి వచ్చేయాలని సూచించారు.

ఈ చిత్రంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు. సీఐటీయూ అనుబంధ విభాగంలో ఉన్నారు. జిల్లాలో ఐదు నెలల నుంచి తమకు జీతాలు, బిల్లులు రావడం లేదని చెబుతున్నారు. అప్పులు చేసి, పాఠశాలల పిల్లలకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నారు. పెండింగ్ జీతాలు, బిల్లులు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్‌కు వస్తే పోలీసులు అడ్డుకున్నారు. ఇక్కడేమీ నినాదాలు చేయవద్దని, కనీసం నిల్చోవద్దని హుకుంజారీ చేశారు. కొద్దిమంది వినతిపత్రమిచ్చి వచ్చేయాలని చెప్పారు. దీంతో వారిలో ఒకరిద్దరు లోపలికి వెళ్లి, అధికారులను కలసి వచ్చేశారు.



## గిరిజన భూ హక్కులను కాపాడాలి

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోనే అత్యంత పేద అనాగరిక వర్గానికి చెందిన గిరిజనుల భూ హక్కులను కాపాడాలని ఎస్‌కోట మండలం బొడ్డవలస, కిల్తంపాలెం, ముషిడిపల్లి, పెద ఖండేపల్లి పంచాయతీలకు చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు. వారంతా స్థానికంగా ఉన్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్త భూ సేకరణ చట్టం-2013 ప్రకారం కంపెనీ పెట్టినందున మళ్లీ మా భూములు మాకు దాఖలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఊరి బడి.. గుండెల్లో అలజడి!



- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- గ్రామంలోని పాఠశాలను మరోచోటకు విలీనం చేయవద్దని విజ్ఞప్తి

సాక్షి, పార్వతీపురం మన్యం:

కూటమి ప్రభుత్వం చేపట్టిన స్కూళ్ల విలీనం ప్రక్రియపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనని తల్లడిల్లుతున్నారు. ఏళ్ల తరబడి ఊర్లో ఉన్న బడిని దూరం చేస్తే.. చిన్న వయస్సులో ఉన్న తమ పిల్లలు రహదారులు, కాలువ గట్లు దాటుకుంటూ ఎలా వెళ్లగలరని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. తమ పిల్లలను అంత దూరం పంపలేమని.. టీసీలిచ్చేస్తే మరో చోటకు మార్చుకుంటామని హెచ్ఎంలను అడుగుతున్నారు. నెలల తరబడి వీరు పోరాటం చేస్తున్నా.. అధికారులు చలించడం లేదు. ప్రభుత్వం కూడా వీరి మొర వినడం లేదు. ఫలితంగా పిల్లలను బడులకు పంపలేక, విద్యాసంవత్సరం వృథా చేయలేక సతమతమవుతున్నారు. మరికొంతమంది ప్రభుత్వ బడుల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు మార్చేస్తున్నారు.

### అన్నిచోట్లా ఇదే పరిస్థితి...

పార్వతీపురం మన్యం జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో కలిపి 1,594 పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలో అనేక పాఠశాలలు విలీనం పేరుతో ఊరికి దూరమవుతుంటే.. అక్కడికి తమ పిల్లలను పంపలేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజుల కిందట బలిజిపేట మండలం పెదపెంకి-1 పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇదే విషయమై కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి తిరుగు ప్రయాణంలో రహదారి ప్రమాదం బారిన పడ్డారు. ఇప్పటికీ వారి పాఠశాల తెరుచుకోలేదు.

- గరుగుబిల్లి మండలం హిక్కింవలస ఎంపీపీఎస్‌లో 3, 4, 5 తరగతులను గరుగుబిల్లి జెడ్పీహెచ్ఎస్‌లో కలపడంపై గ్రామస్తులు కొద్దిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఆ తరగతులను గతం మాదిరి కొనసాగించి, హిక్కింవలస ఎంపీపీఎస్‌ను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చాలని కోరుతున్నారు. గ్రామంలో ఎటువంటి విచారణ చేయకుండానే మార్పు చేశారని ఇప్పటికే మూడు సార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందించారు.
- తమ గ్రామంలోని పాఠశాలను తరలించొద్దని పాలకొండ మండలంలోని బెజ్జి గ్రామస్తులు ఇటీవల ఆందోళనకు దిగారు. ఈ పాఠశాలను కొద్దిదూరంలోని తలవరం యూపీ పాఠశాలలో విలీనం చేశారు. దూరం కావడంతో అక్కడికి తమ పిల్లలను పంపేది లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు.



### ఫౌండేషన్ స్కూల్ వద్దు.. ప్రాథమిక పాఠశాలే ముద్దు

చిత్రంలో కనిపిస్తున్నవారు గరుగుబిల్లి మండలం రావివలస గ్రామస్తులు. తమ ఊరి బడి సమస్యను కలెక్టర్‌కు వివరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు వచ్చారు. ఇక్కడి అంబేడ్కర్ నగర్‌లో ఎంపీపీ పాఠశాల(ఎస్‌డబ్ల్యూ) ఉంది. గతంలో షెడ్యూల్ కులాలు, గిరిజన పిల్లల కోసం.. డ్రాపౌట్లను తగ్గించే ఉద్దేశంతో చాలా ఏళ్ల క్రితం ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వీరి పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్చింది. దీనివల్ల 3, 4, 5 తరగతులను మరోపాఠశాలలో విలీనం చేశారు. దీనివల్ల కలిగే ఇబ్బందులను వివరిస్తూ.. బేసిక్ ప్రైమరీ పాఠశాలగానే ఉంచాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

### గోడు వినండి సారూ...



కలెక్టరేట్‌కు వచ్చిన వీరంతా ఒకప్పుడు మడ్డువలస రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులు. సుమారు 20 ఏళ్ల కిందట బలిజిపేట మండలం పలగర గ్రామం గుడివాడ కాలనీ, కొట్టిస కాలనీగా ఏర్పడి 500 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. అప్పట్లో ప్రభుత్వం నిర్వాసిత కాలనీ పిల్లల కోసం పాఠశాల నిర్మించింది. తల్లిదండ్రుల్లో అధిక శాతం మంది వ్యవసాయ, సిమెంట్ పనుల కోసం చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాలకు వలస వెళ్లిపోతుంటారు. పిల్లలని ఇక్కడే వృద్ధుల వద్ద, బంధువుల ఇళ్లలో ఉంచి చదివిస్తున్నారు. ఇప్పుడు ఆదర్శ పాఠశాల పేరిట నిర్వాసితుల కాలనీ స్కూల్లో ఉన్న పిల్లలను అధికారులు తరలిస్తున్నారు. మార్గమధ్యంలో శ్మశానం, రెండు చెరువులు, పెదంకలాం కాలువ ఉన్నాయి. చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఇప్పటికే పలుమార్లు డీఈఓ, డీఆర్ఓ, కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. వారి మొర ఎవరూ వినడం లేదు. సోమ వారం మరోమారు కలెక్టరేట్‌కు వచ్చారు. 'పాఠశాలల పునఃప్రారంభం నుంచి పిల్లలు బడులకు వెళ్లడం లేదు. వెళ్లినా తిరిగి పంపిస్తున్నారు. మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు. పోనీ, టీసీలు ఇచ్చేయండన్నా ఎవరూ వినడం లేద'ని విద్యార్థుల తల్లులు ఎల్.జయలక్ష్మి, బౌరోతు లక్ష్మి, గుడివాడ నాగమణి, సంధ్యారాణి, నాగళ్ల లక్ష్మి వాపోయారు.

విలీనం పేరుతో గ్రామాలకు దూరమైన పాఠశాలల్లో తల్లిదండ్రులంతా దాదాపు ఇదే ఆవేదనతో ఉన్నారు. • స్కూళ్లు ప్రారంభమై మూడు వారాలు గడిచిపోతున్నాయి. ఇప్పటికీ ఆయా పాఠశాలల్లో పిల్లలు తరగతులకు హాజరు కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా 175 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఈ ఏడాది ఇంకా విద్యార్థులు చేరలేదని అధికారులు గుర్తించారు. గతేడాది ఒకటో తరగతి చదివిన విద్యార్థుల్లో 173 మంది రెండో తరగతిలో చేరలేదు. 3, 4, 5 తరగతుల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. విలీన సమస్యను ప్రభుత్వం పునఃపరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## అడవిబాట పట్టి.. బడిని తీర్చిదిద్ది..

- వసతిని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- గిరిజనులే సొంతంగా గతంలో రేకుల షెడ్, ఇప్పుడు పూరిపాక నిర్మాణం

మక్కువ:

వారంతా అడవి బిడ్డలు. తమ వలే పిల్లలు నిరక్షరాస్యులు కాకూడదని తలచారు. పిల్లలు చదుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లల విద్యాభ్యాసనకు సరైన వసతి లేకపోవడంతో గతంలో రేకులషెడ్ నిర్మించారు. సమస్యను గుర్తించిన గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు శాశ్వతవసతి కల్పించాలని నాడు-నేడు రెండో విడతలో మార్కొండపుట్టి పంచాయతీ కె.పెద్దవలస ప్రాథమిక పాఠశాలకు రూ.37లక్షలు మంజూరు చేసింది. భవన నిర్మాణాలు తలపెట్టింది. రూ.10లక్షల విలువైన పనులు జరిపింది. ఇంతలో ప్రభుత్వం మారింది.



గతంలో గ్రామస్తులు చందాలతో నిర్మించిన రేకులషెడ్



కె.పెద్దవలస ప్రాథమిక పాఠశాలకు పూరిపాకను సిద్ధం చేస్తున్న గిరిజనులు



సిద్ధమైన పాఠశాల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పునాదుల దశలో ఉన్న పాఠశాల వైపు కన్నెత్తి చూడలేదు. తన నియోజకవర్గంలోని పాఠశాల పిల్లలు వసతిలేక ఇబ్బంది పడుతున్నా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పట్టించుకోకపోవడంతో కె.పెద్దవలస గ్రామస్తులు తల్లడిల్లారు. చివరకు.. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 52 మంది పిల్లలు విద్యాభ్యాసనకు ఇబ్బంది పడకుండా ఉండాలన్న లక్ష్యంతో శ్రమదానంతో అడవిలో కర్రలు సేకరించారు. విరాళాలు పోగుచేసి గడ్డను కొనుగోలు చేశారు. సుమారు వారం రోజుల పాటు శ్రమించి ఉపాధ్యాయుల సూచనల మేరకు చక్కని పూరిపాకను నిర్మించారు. దీనిని రెండు, మూడురోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## 535 ఎంఎస్‌పీలకు స్థానచలనం



ఎంఎస్‌పీల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైమ్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన 535 మంది మహిళా సంరక్షణ పోలీసుల(ఎంఎస్‌పీ)కు స్థానచలనం కలిగినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం రాత్రి 10 గంటల వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ సాగింది. ఎస్పీతో పాటు ఏఎస్పీ సౌమ్యలత కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. రోగులైన వారు, వైవాహిక పరిస్థితులు, విజువల్ ఇంప్లెయిడ్, తదితర అంశాలపై బదిలీల్లో పరిగణనలోకి తీసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. మొత్తం 635 మందికి 535 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి వార్డు/గ్రామ సచివాలయాలను కేటాయించామన్నారు. కలెక్టర్ ఉత్తర్వులు మేరకు బదిలీ ఉత్తర్వులను రెండు, మూడు రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐలు లీలారావు, చౌదరి, సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి, ఎస్ఐ ప్రభావతి, ఆర్ఎస్ఐలు నీలిమ,మంగలక్ష్మి, డీపీఓ సిబ్బంది తేజ, రాంబాబు, శ్రీనివాసరావు, సుధారాణి, హేమంత్, పీఆర్వో కోటేశ్వరరావు, ఐటీ కోర్ టీమ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పట్టుకున్న బెల్లంఊటతో ఎస్సై అనీష్ సిబ్బంది

**జియ్యమ్మవలస:** మండలంలోని చినమేరంగి పరిసర ప్రాంతాల్లో సోమవారం దాడులు చేసి 800 లీటర్ల బెల్లం ఊటను పట్టుకుని ధ్వంసం చేసినట్లు చినమేరంగి ఎస్సై అనీష్ తెలిపారు. గ్రామాల్లో సారా, మద్యం అమ్మినా తెలియజేయాలని, అటువంటి వారిపేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై ప్రజలకు సూచించారు.యువత చెడువ్యసనాలకు బానిసకావద్దని హితవు పలికారు. సారా తయారీకి ఉపయోగించిన సామగ్రిని ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

**230 సారా ప్యాకెట్లు సీజ్**

**సాలూరు రూరల్:** మండలంలోని బాగువలస గ్రామం వద్ద ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 230 సారా ప్యాకెట్లు సోమవారం పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. నక్కడ వలస గ్రామానికి చెందిన సురగడ రామ్మోహన్ ను పట్టుకుని సారా ప్యాకెట్లతో పాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.40 వేలు ఫైన్‌రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామని ఈ క్రమంలో మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తుల నుండి సోమవారం కోర్టులో రూ.40 వేలు ఫైన్ కట్టించినట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు.

### చిన్నబగ్గ సమీపంలో ఏనుగులు



చిన్నబగ్గ ఆశ్రమపాఠశాల పక్కతోటలో ఉన్న ఏనుగుల గుంపు

**సీతంపేట:** మండలంలోని చిన్నబగ్గ ఆశ్రమపాఠశాలకు సమీపంలో నాలుగు ఏనుగుల గుంపు ఘీంకరిస్తోంది. సోమవారం రాత్రి ఏనుగులు ఇక్కడికి రావడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. నిన్న, మొన్నటి వరకు చిన్న బగ్గ, గోరపాడు కొండల్లో సంచరించిన ఏనుగులు ఇప్పుడు ఏకంగా గ్రామానికి దగ్గరలోనే తిష్ట వేయడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి గ్రామస్తులు భయపడుతున్నారు. ఏనుగులను కవ్వించవద్దని అటువైపు ఎవ్వరూ తిరగవద్దని స్థానికులకు ట్రాకర్లు తెలియజేస్తున్నారు. ఎఫ్‌బీవో దాలినాయుడుతో పాటు సిబ్బంది ఏనుగుల గమనాన్ని పరిశీలిస్తున్నారు.

### ప్రత్యేక అధికారిని నియమించండి

**విజయనగరం గంటస్తంభం:** జిందాల్ భూసేకరణలో అవకతవకలు జరిగాయని, దీనిని సరిదిద్దేందుకు కలెక్టర్ వెంటనే ఒక ప్రత్యేక అధికారిని నియమించి భూములు కోల్పోయిన రైతులకు న్యాయంచేయాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. భూములిచ్చిన కోన సీతమ్మ, కొదల మదన మేరీ కుటుంబాలకు నేటికీ పరిహారం అందలేదన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

**పార్వతీపురంటౌన్:**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణిలతో కలిసి ప్రజల నుంచి 112 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఐసీడీఎస్ పీడీ డా.టి.కనక దుర్గ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఆర్.కృష్ణవేణి, జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ ఎస్ మన్మథరావు, సర్వే ఎ.డి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

**వాస్తవాలైతే చట్టపరమైన చర్యలు**

**పార్వతీపురం రూరల్:** ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు దారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు వాస్తవాలైతే తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుని పరిష్కరించాలని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే చట్టపరిధిలో నాణ్యమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయానికి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధి నుంచి వచ్చిన బాధితుల ఫిర్యాదులను ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి స్వయంగా స్వీకరించి బాధితులతో ముఖాముఖి మాట్లాడి క్షుణ్ణంగా పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదులలో ముఖ్యంగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, నకిలీపత్రాలు, అధిక వడ్డీల వసూళ్లు, ప్రేమ పేరుతో మోసాలు ఉన్నాయి. మొత్తం 11 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

### ఐటీడీఏ గ్రీవెన్స్ సెల్‌కు 72 అర్జీలు

**సీతంపేట:** స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 72 అర్జీలు వచ్చాయి. చొర్లంగిలో సీహెచ్‌డబ్ల్యూవో పోస్టు ఇప్పించాలని కోడూరుకు చెందిన నీలవేణి కోరారు. హడ్డుబంగి పాఠశాలలో నాడు-నేడు పనులకు బిల్లులు మంజూరు చేయాలని ఎ.గాయత్రి అర్జీ ఇచ్చారు. తల్లికి వందనం డబ్బులు బ్యాంకులో జమకాలేదని కారెంకొత్తగూడకు చెందిన సవర మల్లమ్మ వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, ఈఈ కుమార్, డిప్యూటీ ఈఓ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుడు దేవుడితో సమానం

- విపత్కకాలంలోనూ రోగులకు సేవలు
- నేడు వైద్యుల దినోత్సవం

**విజయనగరం ఫోర్ట్:** వైద్యో నారాయణ హరి అన్నారు పెద్దలు. రోగులు వైద్యుడిని భగవంతుడిలా ఆరాధిస్తారు. ఎందుకంటే ప్రాణాలు నిలబెట్టగలిగే శక్తి వైద్యుడికి మాత్రమే ఉంటుంది. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో నైనా వెరవకుండా ధైర్యంగా సేవలు అందించేది వైద్యులే. నాలుగేళ్ల క్రితం కోవిడ్ మహమ్మారి విలయతాండవం చేసినప్పటికీ వైద్యులు ఏమాత్రం భయపడకుండా వైద్యసేవలు అందించారు. వైద్యుల్లో సేవాదృక్పథంతో పనిచేసే వారు ఉన్నారు. ధనార్జనే ధ్యేయంగా పనిచేసే వారు కూడా ఉన్నారు. సమాజంలో కొత్త కొత్త వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. వాటి నివారణ చర్యలు కనుగొని వైద్యులు సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో రోగులకు సేవలందించే సమయంలో కోవిడ్ బారిన పడి పలువురు వైద్యులు మృత్యువాత పడ్డారు. అయినప్పటికీ మిగిలిన వైద్యులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా కోవిడ్ బాధితులకు సేవలు అందించారు.

**జిల్లాలో 700 మంది వరకు వైద్యులు**

జిల్లాలో 50 పీహెచ్‌సీలు, 7 సీహెచ్‌సీలు, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, 300 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో సుమారు 700మంది వరకు వైద్యులు పనిచేస్తున్నారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

**సేవాభావం ఉంటే వైద్య వృత్తి చేపట్టాలి**



ఓపిక, సహనం ఉంటేనే వైద్య వృత్తిని చేపట్టాలి. సేవాదృక్పథంతో వైద్యసేవలు అందించాలి. సమాజాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి వైద్యులు కృషి చేయాలి. ఆధునాతన వైద్యసేవలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. రోగులు వైద్యులను గౌరవించాలి.

డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

**వైద్యులు గౌరవప్రదంగా మెలగాలి**



సమాజంలో వైద్యులు గౌరవప్రదంగా మెలగాలి. వెద్యులను ప్రోత్సహిస్తే వారు మరింత ఉత్సాహంగా పనిచేస్తారు. వైద్యులపై ఒత్తిడి పెట్టకూడదు. ఒత్తిడి లేకుండా ఉంటే మెరుగైన వైద్యసేవలు అందించగలరు. వైద్యులు రోగులకు ప్రేమతో సేవలు అందించాలి.

డాక్టర్ పద్మశ్రీ రాణి, డీసీహెచ్‌ఎస్

**వైద్యవృత్తి ఉన్నతమైనది**



వైద్యవృత్తి ఉన్నతమైనది. ప్రజలు డాక్టర్‌ని గౌరవించాలి. వైద్యం కోసం వచ్చే వారితో ప్రేమగా, ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యను తెలుసుకుని అవసరమైన వైద్యాన్ని అందించాలి. వైద్యవృత్తిని చేపట్టినందుకు అదృష్టంగా భావించాలి. ప్రతి రోగిని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలి

డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్, సర్వజన ఆస్పత్రి

# చెరువు ఆక్రమణలు తొలగించండి

**భోగాపురం:** మండలంలోని తూడెం పంచాయతీ పరిధిలో ఉన్న బసవపాలెం కూర్మయ్య చెరువు ఆక్రమణకు గురైందని పంచాయతీకి చెందిన పలువురు ఆరోపించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమణమ్మను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. కూర్మయ్య చెరువును సగభాగం కప్పివేసి మామిడి మొక్కలు వేశారని, షెడ్డు నిర్మాణం చేశారన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే చెరువు గర్భంలో మట్టి రోడ్డు నిర్మించారని ఆక్రమణలు తొలగించాలని కోరారు.



తహసీల్దార్ రమణమ్మకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

## కూటమి పెద్దలకి పరమాన్నం, పేదలకి గంజి నీళ్లు

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు

**విజయనగరం గంటస్తంభం:** కాంగ్రెస్, తెలుగుదేశం, నేటి కూటమి ప్రభుత్వాలు గత 20 ఏళ్లుగా కాగ్నిజెంట్, టీసీఎస్, జిందాల్ లాంటి కంపెనీలకు కారుచౌకగా భూములను కట్టబెడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ జిల్లా కార్యాలయం డీఎస్ఆర్ అమర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ..కోనేటి రంగారావు భూకమిటీ సిఫార్సులను అనుసరించి నాటి నుంచి నేటి వరకు ఎక్కడా ఎకరా భూమి కూడా పేద రైతులకు, పేదలకు 3 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చిన ధాఖలాలు లేవని మండిపడ్డారు. భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులను, నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగించడమే కానీ పేదలకు భూమి ఇవ్వడానికి చేతులు రాని ప్రభుత్వాలు కార్పొరేట్లకు మాత్రం వేలాది ఎకరాల భూమిని కారుచౌకగా కట్టబెడుతున్నాయని విమర్శించారు. విజయనగరం జిల్లాలోని ఎస్.కోట నియోజవర్గం బొడార ప్రాంతంలో ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 1100 ఎకరాల్లో 900 ఎకరాలు ప్రభుత్వ భూమిని జిందాల్ కంపెనీకి ఇవ్వడానికి తలపెట్టి బాక్సైట్ శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలనే తలంపుతో ఆనాటి జిల్లా జాయింట్ కలెక్టర్ జగన్మోహన్ రావు నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. ప్రస్తుత ఉన్న కలెక్టర్ ఇటీవల కాలంలో మీడియాలో ఏ ప్రభుత్వం భూ సేకరణ జరపలేదని మాట్లాడారు. భూ సేకరణ చేయకుంటే ప్రజాభిప్రాయ సేకరణ ఎందుకు జరిగిందో నేడున్న కలెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిందాల్ భూముల విషయంలో ఆందోళనకారులపై దాడులు, నిర్బంధాలు, అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలియచేశారు. పేదలకు అందాల్సిన పరిహారంలో అవకతవకలు జరిగినట్లు అనేక ఆరోపణలు వచ్చాయని దీనిపై తగు న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, అలమండ ఆనందరావు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

### బెదిరింపు ప్రకటనలు సరికాదు

- జిందాల్ భూములను రైతులకు అప్పగించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు, సభ్యులు

**విజయనగరం గంటస్తంభం:** 2006లో జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం తీసుకున్న భూములను చట్టప్రకారం పరిశ్రమ పెట్టనందున రైతులకు తిరిగి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం వ్యవహరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు బెదిరింపు ప్రకటనలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విజయనగరంలోని ఎల్బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రైతుల నుంచి భూములు తీసుకుని 17 సంవత్సరాలైనా నేటివరకు ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని, స్థానిక ప్రజలకు ఉపాధి చూపలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల నుంచి తీసుకున్న భూములను ఐదేళ్లలో పరిశ్రమ కట్టకపోతే తిరిగి రైతులకు అప్పజెప్పాలని చట్టంలో ఉన్న విషయం అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. 2006 భూ సేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఎందుకు అప్పటి జాయింట్ కలెక్టర్ నిర్వహించారని ప్రశ్నించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చేస్తే ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు ఆ రోజు పరిశ్రమను వ్యతిరేకించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. పరిశ్రమ పెట్టకపోతే భూములు వెనక్కి ఇవ్వకుండా ఇప్పుడు ఎంఎస్ఎంఈ పార్కు పెడతామని, అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బెదిరించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులకు ఈ భూములు అప్పగించాలన్న కుట్ర తప్ప మరొకటి కాదన్నారు. ఒక వేళ కొత్త పరిశ్రమ కోసం భూమి కావాలంటే పబ్లిక్ హియరింగ్ పెట్టి మళ్లీ భూ సేకరణ చేపట్టి రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం చెల్లించి తీసుకోవాలి తప్ప బెదిరించి తీసుకుంటామని అనడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టీవీ.రమణ పాల్గొన్నారు.

### అట్రాసిటి కేసు నమోదు

**గంట్యాడ:** విజయనగరానికి చెందిన ఓ దళిత యువతి, నరవ గ్రామానికి చెందిన ఓయువకుడు ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం పెళ్లి చేసుకోవాలని యువకుడిని యువతి కోరగా అందుకు నిరాకరించాడు. దీంతో యువతి గంట్యాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సదరు యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు.

# సీపీఓ సేవలు అభినందనీయం





సీపీఓ వీరరాజు దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

**పార్వతీపురంటౌన్:** జిల్లా ప్రణాళిక అధికారి వీరరాజు సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా ప్రణాళిక అధికారి వీరరాజు ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై వీరరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరరాజు మంచి సేవాతత్పరతతో వృత్తిని నిర్వహించారని ప్రశంసించారు. అంకిత భావంతో సేవలు అందించడం వల్ల మన్ననలు పొందగలరని పేర్కొన్నారు సీనియర్ల సేవలను జూనియర్లు గుర్తించి వారిని మార్గదర్శకంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. రిటైర్ అయిన సీపీఓ పి.వీరరాజు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. వృత్తిలో సంతృప్తి పొందానని పేర్కొన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు సహకరించిన కలెక్టర్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలి


**పార్వతీపురంటౌన్:** మాదక ద్రవ్యాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు మందులు కుటుంబాలను, ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయన్నారు. వాటిపై అవగాహన అత్యావశ్యమన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యమని, దానిని కాపాడుకోవడం మన కర్తవ్యమని చెప్పారు. యోగా వంటి ఆరోగ్య అంశాల పట్ల ఆసక్తి కలిగి ప్రతిరోజూ సాధన చేయడం వల్ల ప్రయోజనాలు ఉంటాయని హితవు పలికారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందులు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా ఆర్థికంగా, మానసికంగా కుటుంబాలను నాశనం చేస్తాయన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభమయ్యాయని వాటి చుట్టు పక్కల ఎటువంటి విక్రయాలు, కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఉండాలని స్పష్టం చేశారు. అటవీ, మారుమూల ప్రాంతంలో సారా తయారీ వంటి అంశాలను గమనించాలని ఆదేశించారు. మాదక ద్రవ్యాల విక్రయాలు వివిధ రూపాల్లో ఉండే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందుల ఉత్పాదకత, సరఫరా, రవాణా, విక్రయాలు, వినియోగం జరిగితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాటికి సంబంధించిన వివరాలు తెలిసినవారు 1972 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. రవాణా వాహనాలను తనిఖీలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ ఎస్వీ మాధవ రెడ్డి, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా రవాణా అధికారి వి.దుర్గాప్రసాద్ రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కె.సుమిత్ర, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆశ షేక్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వీవీవీ ఎస్ఎస్‌బాబు, ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎ.కె.పాణిగ్రహి, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

# రోడ్డుప్రమాదంలో బీటెక్ విద్యార్థిని మృతి

**కొత్తవలస:** మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దుర్మరణం చెందింది. అందాల లోకాన్ని చూడడానికి వెళ్తూ అనంత లోకాలకు పయనమైంది. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి చెందిన కర్రి నాగమణి (20) తన స్నేహితుడైన విశాఖపట్నం జిల్లా ప్రహ్లాదపురానికి చెందిన దాసరి కార్తీక్ ఇంటికి వచ్చింది. అక్కడి నుంచి అరకు అందాలను తిలకించేందుకు నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్రవాహనాలపై బయల్దేరారు. దాసరి కార్తీక్‌కు చెందిన స్కూటీపై నాగమణి పయనిస్తోంది.కాగా మంగళపాలెం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం డిపోకు చెందిన సిటీ బస్సు స్టాపర్‌ను తప్పించ బోయి స్కూటీపైకి వెళ్లడంతో స్కూటీపై పయనిస్తున్న ఇద్దరూ రోడ్డు అంచున పడిపోయారు. కార్తీక్ కొద్దిగా దూరంగా పడడంతో సురక్షితంగా తప్పించుకున్నాడు. నాగమణి బస్సుపై పడిపోవడంతో తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. నాగమణి విజయనగరంలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతోంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మన్మథరావు తెలిపారు.



ప్రమాద స్థలంలో పడిపోయిన స్కూటీ



మృతిచెందిన నాగమణి

## విరమణ వృత్తికే కాని సేవా ధర్మానికి కాదు

**పార్వతీపురం రూరల్:** ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వృత్తికే కానీ సేవాధర్మానికి కాదని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై పి.సత్యనారాయణ, ఏఎస్సైలు ఎం.సత్యనారాయణ, వేణుగోపాల ప్రాణిగ్రహి, ఆరిక చిన్నయ్య, సత్యవరపు రజనిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో అంకిత భావంతో సేవలందించిన వారి సేవలు పదిలంగా ఉంటాయని ఉద్యోగ విరమణ పొందిన వారు తమ అమూల్యమైన సూచనల మేరకు విధి నిర్వహణలో అనుభవ పూర్వకమైన సందర్భాలను ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పంచుకోవాలని కోరారు. విరమణ అనంతరం వారి శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువాలతో సన్మానించి, జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరపున జ్ఞాపికలు, చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ రంగనాథం, ఏఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, ఏఏఓ సతీష్‌బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి, జిల్లా పోలీసుశాఖ ఉన్నతాధికారులు